



జెడ్ వీరారెడ్డి చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న నాయకులు


రైతునాయకుడు జెడ్ వీరారెడ్డి

ప్రజాశక్తి - అనంతపురం కలెక్టరేట్

సిపిఎం సీనియర్ నాయకులు, గుత్తి మాజీ సమితి అధ్యక్షులు జెడ్. వీరారెడ్డి ఆదర్శరైతు నాయకులు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి. రాంభూపాల్ పేర్కొన్నారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో రైతు సంఘం జిల్లా కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి అధ్యక్షతన జెడ్ వీరారెడ్డి 19వ వర్ధంతి సభను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ రైతుగా, న్యాయవాదిగా, రాష్ట్రస్థాయి ఫుట్ బాల్ క్రీడాకారుడుగా, సమితి ప్రెసిడెంట్‌గా, కమ్యూనిస్టు నేతగా ఇలా బహు రంగాల్లో రాణించిన అరుదైన వ్యక్తి జెడ్ వీరారెడ్డి అన్నారు. గుత్తి తాలూకాలోని పెద్దవడుగూరు గ్రామంలో ధనిక రైతు కుటుంబంలో జన్మించిన వీరారెడ్డి విద్యార్థి దశలోనే అభ్యుదయ భావాలవైపు ఆకర్షితుడై ఆ తరువాత కమ్యూనిస్టు నేతగా మారారన్నారు. మార్క్సిస్టు సాహిత్యాన్ని అధ్యయనం చేసి కమ్యూనిస్టు భావాల వైపు ఆకర్షించ బడ్డారన్నారని చెప్పారు. ఆయన లా చదువు పూర్తి చేసినప్పటికీ వృత్తికి పరిమితం కాకుండా ప్రజా ఉద్యమాల్లో ఉండేందుకు నిర్ణయించుకున్నారని రైతు సంఘం ద్వారా రైతులను ఐక్యం చేయడం వారి సమస్యలపై పోరాటాలు నిర్వహించడం తన జీవిత లక్ష్యంగా భావించారని అన్నారు. గుత్తి సమితి కి జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారని చెప్పారు. ప్రజా ప్రతినిధిగా తన పదవీకాలంలో తాలూకాలో విస్తృతంగా పర్యటించి గ్రామాలకు తాగునీరు, పాఠశాల, విద్యుత్, రోడ్లు తదితర మౌలిక సదుపాయాలు కల్పించడం కోసం కృషి చేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవటానికి అనేక పోరాటాలు చేసి అభివృద్ధి పనులను నిధులు సాధించారని దీనివల్ల గ్రామాల్లో కమ్యూనిస్టు పార్టీకి ప్రజల్లో మంచి సంబంధాలు ఏర్పడ్డాయని చెప్పారు. తన 67 వ సంవత్సరాల వయసులో జిల్లాలో పట్టు రైతులు సమీకరించేనందుకు హిందూపురం ప్రాంతానికి వెళ్లి అక్కడ జరిగిన పోలీసు లాఠీ చార్జ్‌లో తీవ్రంగా గాయపడ్డారని గుర్తుచేశారు. జిల్లా వ్యాప్తంగా పర్యటిస్తూ రైతు సంఘం నిర్మాణానికి కృషి చేశారన్నారు. ఆయన ఆశించిన సోషలిజాన్ని సాధించేందుకు కృషి చేయడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం. బాలరంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు రామాంజనేయులు, వెంకటనారాయణ, నాగమణి , నాయకులు సురేష్, వన్నూరప్ప, శివ, హరీష్ , శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఇళ్లు' ఏవన్నా..?

- ◆ దిష్టి బొమ్మల్లా టిడ్కో గృహాలు
- ◆ పునాదులు దాటని జగనన్న కాలనీలు
- ◆ పేదల సొంతింటి కల నెరవేరేది ఎలా..?



పునాదులకే పరిమితమైన జగనన్న గృహాలు

ఎన్నికలు ఎప్పుడు వచ్చిన....ఏ పార్టీ అయినా చెప్పేది ఒక్కటే మాట.. పేదల సొంతింటి కలను నెరవేరుస్తాం... అయితే ఎన్నికలు ముగిశాక ఇచ్చిన సొంతింటి హామీ అటకెక్కుతుంది. మళ్లీ ఎన్నికలు వస్తాయి.జ మళ్లీ సొంతింటి కల నెరవేరుస్తామంటూ హామీలు ఇస్తారు. ఇది ఆ పార్టీ అని కాదు, ఈ పార్టీ అని కాదు. ఏపార్టీ అయినా అంతే..!!

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలో గత 15 సంవత్సరాల నుంచి పేదల సొంతింటి కల మాత్రం నెరవేరడం లేదు.ఉండడానికి సొంతిల్లు లేక పేదలు వేలాది రూపాయలు అద్దె చెల్లించి నివాసం ఉంటున్నారు. గత ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి కొటిపి వద్ద కేంద్ర ప్రభుత్వ సహకారంతో టిడ్కో గృహ నిర్మాణ పనులను ప్రారంభించింది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా పనులే ఇంకా పూర్తి కాలేదు. దీనికి ప్రధాన కారణం గత ప్రభుత్వం చేసిన పనులకు బిల్లులు మంజూరు చేయలేదు.ప్రస్తుత ప్రభుత్వం దానిని పట్టించు కోలేదు. కనీసం జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలు పునాదులు దాటలేదు. దీంతో పేదల సొంతింటి కల కలగానే మిగిలిపోయింది.

గత టిడిపి ప్రభుత్వం ఇళ్లు లేని నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తామని చెప్పింది. కొటిపి సమీపంలో టిడ్కోతో అపార్టమెంట్స్ నిర్మాణం చేసి అందరికి ఇస్తామని పనులను ప్రారంభించింది. ఆ పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. అనంతరం వచ్చిన జగనన్న ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చడమే తమ లక్ష్యం అని జిల్లా వ్యాప్తంగా జగనన్న కాలనీలను ఆర్భాటంగా ఏర్పాటు చేసింది. ఇళ్ల నిర్మాణాలను మూడు ఆప్షన్లుగా విభజించిన ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల పనులకు శ్రీకారం చుట్టింది. మొదటి, రెండవ ఆప్షన్లలో లబ్దిదారులే నిర్మాణం చేసుకోవాలని, మూడవ ఆప్షన్లలో ప్రభుత్వమే నిర్మాణం చేసి ఇస్తుందని లబ్దిదారులకు చెప్పింది. హిందూపురం పురపాలక సంఘంలో రెండు ప్రాంతాల్లో జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. కొట్నూరు వద్ద ఏర్పాటు చేసిన కాలనీలో కాస్త పనులు జరుగుతున్నాయి. కొటిపి వద్ద ఏర్పాటు చేసిన కాలనీలో నిర్మాణపనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా ఉన్నాయి. ప్రభుత్వం రెండు సార్లు మెగా గ్రౌండింగ్ మేళా చేపట్టింది. కొంతమంది లబ్ధిదారులు సొంత ఖర్చులతో పునాదులు తీయించే విధంగా చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు లే అవుట్లలో సిమెంటు రహదారులు, తాగునీటి సరఫరా పైపులైన్లు, విద్యుత్తు సరఫరా వంటి మౌలిక వసతులతో పాటు గుత్తేదారులు అడిగిన సిమెంటు, స్టీల్, ఇసుక అన్ని అధికారులు సమకూర్చినప్పటికి పూర్తి స్థాయిలో పనులు జరగలేదు. దీంతో పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయి. కొంత మంది మెగా గ్రౌండింగ్ మేళా సమయంలో తామే సొంతంగా ఇల్లు నిర్మించుకుంటామని ముందుకు వచ్చారు. అయితే పెరిగిన ధరలకు భయపడి వారు సైతం పునాదులు వేసి వదిలేశారు. మరికొంత మంది తమ వల్లకాదని ప్రస్తుతం పెరిగిన ధరలతో ఇళ్ల నిర్మాణం చేయలేమని చేతులెత్తాశారు. ప్రభుత్వమే ఇళ్ల నిర్మాణం చేసి ఇవ్వాలని వారు కోరుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జిల్లాలో తొలి విడత కింద దాదాపు 1.20లక్షల మందికి ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో 1.5 సెంటు, పట్టణాల్లో ఒక సెంటు చొప్పున స్థలం కేటాయించింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో ఇళ్లను నిర్మించనున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం లబ్ధిదారులకు మూడు ఐచ్ఛికాలు ఇచ్చి అందులో ఒకటి ఎంచు కోవాలని చెప్పింది. జిల్లాలో అత్యధిక శాతం మంది ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. హిందూపురం పురపాలక సంఘంలో అయితే మొత్తం 5712 మందిని తొలి విడత ఎంపిక చేశారు. ఇందులో 784 మంది మొదటి, రెండవ ఆప్షన్ల కింద ఇళ్ల నిర్మాణలను చేపట్టారు. మిగిలిన 4928 మంది లబ్దిదారులు ప్రభుత్వమే నిర్మాణం చేసి ఇవ్వాలని కోరారు. దీంతో ప్రభుత్వం బెంగళూరుకు చెందిన ఎజెన్సీకి పనులను అప్పగించింది. అయినప్పటికి పనులు మాత్రం వేగవంతంగా జరగడం లేదు. అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి వేగవంతం చేయాలని ఆదేశాలు ఇస్తునప్పటికి పనులు ముందుకు సాగడం లేదు. సంవత్సర కాలంగా పనులు మాత్రం పునాదులకే పరిమితం అయ్యాయి.

పెరిగిన ధరలతో ఇదీ పరిస్థితి..!

పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టణ ప్రాంతంలో ఒక్క యూనిట్‌కు రూ .1.80 లక్షలు ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. గ్రామీణ ప్రాంతంలో రూ .1.50 లక్షలు కేంద్రం ఇస్తోంది. రూ .30 వేలు నరేగా కింద సర్దుబాటు చేస్తున్నారు. పట్టణ ప్రాంతంలో రూ.1.50 లక్షలు కేంద్రం ఇస్తోంది. రూ .30 వేలు రాష్ట్రం భరించాల్సి ఉంది. హిందూపురంలో దాదాపు 5600 గృహాలను మంజూరు చేశారు. గత ఏడాదిలో నిర్మాణాలు పూర్తి చేయాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే ఆ లక్ష్యం ఇప్పటి వరకు పూర్తి కాలేదు. పెరిగిన సిమెంటు ధరలతో ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చే సాయం సరిపోవడం లేదు. దీనికి ధరల మంట తోడయ్యింది. ఒక గృహం 342 చదరపు అడుగుల విస్తీర్ణంలో పునాదులు, గోడలు స్లాబ్ మాత్రమే నిర్మాణం చేయాల్సి ఉంది. లబ్దిదారులు నిర్మాణం చేసుకుంటే పునాది పూర్తి చేస్తే రూ.60 వేలు, పైకప్పు వరకు స్లాబ్ బిల్లులు నిర్మాణం చేస్తే రూ.60 వేలు, పై కప్పు వేస్తే రూ.30 వేలు చొప్పున చెల్లిస్తారు. అయితే ప్రభుత్వం చెల్లించే నిధులు సరిపోక పోవడంతో నిర్మాణాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని ఇచ్చే నిధులను పెంచి, వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించి, బిల్లులు ఎప్పటికప్పుడు మంజూరు చేస్తే నిర్మాణాలు వేగవంతం అయ్యే అవకాశాలు ఉన్నాయి.



టిడ్కో గృహాల చుట్టూ పిచ్చిమొక్కలు, కంపచెట్లు పడిన దృశ్యం

మొరాయించిన ఆర్టీసీ బస్సు

ప్రయాణికుల ఇబ్బందులు

ప్రజాశక్తి-పుట్లూరు

మండల కేంద్రంలోని హెచ్ఎల్‌సి కాలువ వద్ద బుధవారం ఓ ఆర్టీసీ బస్సు మొరాయించింది. నడిరోడ్డుపై బస్సు నిలిచిపోవడంతో అటు ప్రయాణిలు, ఇటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అంతేగాకుండా సమయానికి గమ్యస్థానాలకు వెళ్లలేక విద్యార్థులు, ప్రజలు తిప్పలు పడ్డారు. కాలం చెల్లిన బస్సులు గ్రామాలకు నడుపుతుండటంతోనే ఈ పరిస్థితి దాపురించిందని స్థానికులు వాపోతున్నారు. బస్‌ఛార్జీల పెంపులో ఉన్న శ్రద్ధ బస్సులకు మరమ్మతులు చేయడంలో లేదని విమర్శిస్తున్నారు. ముఖ్యంగా బస్సు మెరాయిండంతో విద్యార్థులు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లలేకపోయారు. మరమ్మతులకు వచ్చిన బస్సులు నడపడం వల్ల ఏదైనా జరగరానికి జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి విద్యార్థులకు వెళ్లే బస్సులను కండీషన్‌లో ఉన్న బస్సులను నడపాలని విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు కోరుతున్నారు.



పుట్లూరులో మొరాయించిన ఆర్టీసీ బస్సు

27న చంద్రబాబు జిల్లా పర్యటన

టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు

అనంతపురం కలెక్టరేట్ : టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు ఈనెల 27న జిల్లాలో పర్యటించనున్నట్లు టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు కాలవ శ్రీనివాసులు, పిఎసి ఛైర్మన్ పయ్యావుల కేశవ్ అన్నారు. బుధవారం నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉరవకొండలో నిర్వహిస్తున్న రా కదలిరా కార్యక్రమానికి చంద్రబాబు రానున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా వైసిపి అరాచక పాలనపై ప్రజలకు వివరించి చైతన్యం కల్పించనున్నారని తెలిపారు. కావున జిల్లాలోని ఏడు నియోజకవర్గాల నుంచి పెద్దఎత్తున పార్టీ శ్రేణులు కదిలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు ప్రభాకర్‌చౌదరి, జితేంద్రగౌడ్, కళ్యాణదుర్గం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఉమామహేశ్వరనాయుడు, నాయకులు శ్రీధర్‌చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు

25న జాతీయ ఓటర్ల దినోత్సవం : కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్ : ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఓటుహక్కు, ప్రజాస్వామ్య వ్యవస్థలపై ప్రజలు, విద్యార్థులకు అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. కావున కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవంలో అధికారులు, ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

'పాల వెల్లువ'ను విజయవంతం చేయాలి

అనంతపురం కలెక్టరేట్ : జిల్లాలో అమలు చేస్తున్న పాల వెల్లువ కార్యక్రమాన్ని జయప్రదం చేయడం కోసం ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని జేసి ఛాంబర్‌లో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జగనన్న పాల వెల్లువ పథకం ఫిబ్రవరి 1 2024న అనంతపురం జిల్లాలో అమలు చేయబోతున్న సందర్భంగా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. మొదటి విడతలో బల్క్ మిల్క్ చిల్లింగ్ యూనిట్లు కొర్రపాడు, రాచానపల్లి వంటి 100 గ్రామాల నుంచి పాల సేకరణ ప్రారంభం చేస్తున్న సందర్భంగా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి, జిల్లా కోపరేటివ్ ఆఫీసర్, డిప్యూటీ డైరెక్టర్ ఆంధ్ర ప్రదేశ్ పాడి పరిశ్రమ అభివద్ధి సంస్థ అధికారులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఏర్పాట్లు

అనంతపురం కలెక్టరేట్ : ఈనెల 26వ తేదీన నిర్వహించనున్న గణతంత్ర దినోత్సవ వేడుకలకు త్వరితగతిన ఏర్పాట్లు పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. బుధవారం నగరంలోని పరేడ్ మైదానంలో నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్‌తో కలిసి గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణతంత్ర దినోత్సవంలో పాల్గొనే అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజల కోసం సీటింగ్ ఏర్పాటు, తాగునీటి సరఫరా, తదితర అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ జి.వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ బాలకిషన్, జిల్లా టూరిజం అధికారి నాగేశ్వర్, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న జెసి కేతన్‌గార్గ్, అధికారులు

ఎన్నికల వేళ పకడ్బందీగా పని చేయాలి : ఎస్పీ

అనంతపురం క్రైం : ఎన్నికల వేళ మద్యం, నగదు, బంగారు నగలు అక్రమంగా రవాణా కాకుంఆడ పకడ్బందీగా పని చేసి నిఘా వేయాలని ఎస్పీ కెకెఎన్ అన్బురాజన్ సూచించారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో చేపట్టిన బదిలీల్లో భాగంగా జిల్లా సెబ్ విభాగంలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సిఐలు, ఎస్ఐలతో బుధవారం స్థానిక పోలీసు కాన్ఫరెన్స్ హాలులో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జరుగనున్న ఎన్నికల సందర్భంగా అప్రమత్తంగా పని చేయాలన్నారు. ముఖ్యంగా కర్నాటక నుంచి జిల్లాలోకి లిక్కర్ అక్రమంగా తరలించకుండా చర్యలు చేపట్టాలన్నారు. నాటుసారా తయారీ స్థావరాలు, ఊటలను ధ్వంసం చేయాలన్నారు. కర్నాటక సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టులను ముమ్మరం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సెబ్ అదనపు ఎస్పీ జి.రామకృష్ణ, పలువురు సిఐలు, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి మంత్రదండం ఫలితాన్నిచ్చేనా..?

అసమ్మతి భయంతో బుజ్జగింపుల పర్వం

కదిరి వైసిపిలో రాజకీయ కాక

ప్రజాశక్తి - కదిరి

రాష్ట్రంలో ఎన్నికల సమీపిస్తున్న సమయంలో కదిరి వైసీపీలో రాజకీయ కాక మొదలైంది. వైసిపి అధిష్టానం ఇటీవల కదిరి నియోజకవర్గానికి నూతన సమన్వయకర్తను నియమించింది. ఇక్కడే అసలు రణరంగం మొదలైంది. నూతన సమన్వకర్త మార్పును పార్టీలోని సీనియర్లు వ్యతిరేకిస్తూ రోజుకొకరు చొప్పున తమ అసంతృప్తిని వెల్లగక్కుతున్నారు. పార్టీకోసం పనిచేసిన వారు పార్టీని వీడుతుండడం, ప్రతిపక్ష పార్టీలు బలపడుతుండడం, తాను నియమించిన వ్యక్తికి స్థానికంగా పూర్తి సహకారం అందకపోవడం తదితర విషయాలకు మంత్రికి తలనొప్పులు తెస్తున్నాయి. ఏదో ఒక విధంగా తాను నియమించిన వ్యక్తికి మద్దతు కూడగట్టడానికి మంత్రి నానా పాట్లు పడుతున్నారు. ఇటీవల హిందూపురం నియోజకవర్గంలో ఐదు రోజులు పాటు పర్యటించిన మంత్రికి అనుకున్నస్థాయిలో అనుకూల పవనాలు వీచలేదన్న విమర్శలు ఉన్నాయి. దీంతో నూతన సమన్వయ కర్తకు సహకరించని వారిని నాయానో భయానో గుప్పెట్లోకి తెచ్చుకోవడానికి ప్రయత్నించినట్లు సమాచారం. అయితే అదే మంత్రి కదిరి నియోజకవర్గంలో అసమ్మతి నాయకులను తనవైపు తిప్పుకోవటానికి మరోమార్గాన్ని అనుసరించారన్న అభిప్రాయలు వ్యక్తమవుతున్నాయి. బుజ్జగింపుల పేరుతో అసమ్మతి నాయకుల గడపలు తొక్కడం మొదలుపెట్టారన్న వ్యాఖ్యానిస్తున్నారు. ఏ అసమ్మతి నాయకుని దగ్గరికి పోయినా ఒకే మంత్రం ఒకే తంత్రం అవలంభిస్తున్నట్లు తెలుస్తోంది. 'పార్టీ గెలుస్తుంది మీకు న్యాయం చేస్తాం.. ఎమ్మెల్సీ వస్తుంది భయపడకు నేనున్నా' అని భుజం తట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆ పార్టీలో వారు చెబుతున్నారు. అందులో భాగంగా నాలుగు రోజుల క్రితం కొంతమంది అసమ్మతి నాయకుల దగ్గరకు వెళ్లి ఇలాగే భరోసా ఇచ్చారని ఆయా నాయకుల అనుచరుల నుంచి అందిన సమాచారం. ఈ నేపథ్యంలో నూతన సమన్వయకర్తకు ఏ మేరకు వారు తమ సహకారాన్ని అందిస్తారో తెలుసుకోవాలంటే మరికొద్ది రోజులు వేచి చూడాల్సుంది.



ఆర్థిక బకాయిలు చెల్లించాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, పెన్షనర్‌లకు రావాల్సిన ఆర్థిక బకాయిలను తక్షణమే చెల్లించాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి వి.కోటేశ్వరప్ప, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య డిమాండ్ చేశారు. బుధవారం ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజాస్వామిక, అహంకారపూరిత, నిరంకుశ వైఖరిని వ్యతిరేకిస్తూ యుటిఎఫ్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఉపాధ్యాయ భవన్ నుంచి టవర్‌క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్ ఉపాధ్యాయ భవన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అన్ని రకాల బకాయిలను పూర్తి స్థాయిలో చెల్లించే వరకూ తమ పోరాటం ఆగదన్నారు. సిఎం జగన్ ఎన్నికల ముందు తాము అధికారంలోకొస్తే ఉద్యోగుల పక్షపాతిగా ఉంటామని హామీ ఇచ్చి విస్మరించారన్నారు. ముఖ్యంగా సిపిఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తానని చెప్పి జిపిఎస్ అనే అతి దుర్మార్గమైన విధానాన్ని తీసుకురావడం మాట తప్పి ఉద్యోగ ఉపాధ్యాయులను వంచించారని విమర్శించారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కోటేశ్వరప్ప మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ అవసరాల కోసం దాచుకున్న సొమ్ములను సైతం రాష్ట్ర ప్రభుత్వం తమ అవసరాలకు మళ్లించిందని ఆరోపించారు. ఉద్యోగులకు తెలియకుండా ఉద్యోగుల సొమ్మును కాజేసిన ప్రభుత్వంగా జగన్మోహన్ రెడ్డి సర్కార్ చరిత్ర కెక్కిందన్నారు. పిఆర్‌సిని అమలు చేసే వరకూ 30 శాతం మధ్యంతర భతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు సిపిఎస్ ఉద్యోగుల ఖాతాలకు రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన వాటా సుమారు రూ.2500 కోట్లు బకాయి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు రమణయ్య జిల్లా సహాధ్యక్షులు రామప్ప, సరళ, జిల్లా కార్యదర్శులు సంజీవ్ కుమార్, శేఖర్, ఆడిట్ కమిటీ కన్వీనర్ సుబ్బరాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దేవేంద్రమ్మ, మోడల్ స్కూల్ నాయకులు శివానంద, అనంతపురం కార్పొరేషన్ నాయకులు ఆదిశేషయ్య, శ్రీనివాసులు, నాగేంద్ర, మల్లికార్జున వివిధ మండలాల నాయకులు హెంద్రీ, వీరేశ్వరాచారి, పవన్ కుమార్, చంద్రమోహన్, లక్ష్మీదేవి, దివాకర్, దస్తగిరి, రఘు, నాగరాజు, ఉమాపతి, పుల్లయ్య, ఇక్బాల్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న యుటిఎఫ్ నాయకులు

కాంగ్రెస్‌తోనే అన్నివర్గాల అభివృద్ధి

మాజీమంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్

ప్రజాశక్తి-ఉరవకొండ

కాంగ్రెస్ పార్టీతోనే దేశంలోని అన్నివర్గాల అభివృద్ధి సాధ్యమని పిసిసి మాజీ అధ్యక్షులు, మాజీమంత్రి డాక్టర్ సాకే.శైలజానాథ్ అన్నారు. బుధవారం ఉరవకొండలోని సత్యం కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లడుతూ నూతనంగా పిసిసి అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన షర్మిల ఈనెల 28న జిల్లాకు వస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగానే నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో రాయలసీమ జిల్లాలు ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నా వారి సమస్యల గురించి మాట్లాడే నాయకులే లేకుండా పోయారన్నారు. ముఖ్యంగా హంద్రీనీవా నీటి వాటాను 5 టీఎంసీల నుంచి 50 టీఎంసీల వరకు పెంచినా వర్షాలు రాకపోతే పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇదే విషయాన్ని ప్రధాన అజెండాగా పెట్టుకుని పిసిసి అధ్యక్షురాలు షర్మిల జిల్లా పర్యటనకు రానున్నట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, కుటుంబ సభ్యులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బండ్లపల్లి ప్రతాపరెడ్డి, నియోజకవర్గ ఇన్‌ఛార్జి రామానాయుడు, డిసిసి ప్రధాన కార్యదర్శి సోనియా సీన, మైనార్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి అబ్బాస్, రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు దాదాగాంధీ, పట్టణ కార్యదర్శి సుధాకర్, కూడేరు మండల నాయకులు రమణ, నియోజకవర్గ పరిశీలకులు ప్రభాకర్, రాష్ట్ర యువజన కార్యదర్శి పోసా రాము, వజ్రకరూరు మండల కన్వీనర్ శ్రీకాంత్ వర్మ, తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడతున్న మాజీమంత్రి డాక్టర్ సాకే శైలజానాథ్

జెడ్ వీరారెడ్డి ఆశయాలను కొనసాగిద్దాం

సిపిఎం ఆధ్వర్యంలో నివాళి

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

పేదలు, రైతుల పక్షపాతి కామ్రేడ్ జెడ్.వీరారెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సిపిఎం మండల కార్యదర్శి దస్తగిరి, నాయకులు రాజా, రామాంజనేయులు, ఆది, సుంకులన్న పిలుపునిచ్చారు. జెడ్ వీరారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని మండల కేంద్రంలోని ఆయన ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కోసం సొంత భూమినే దానం చేసిన ఘనత వీరారెడ్డిది అని కొనియాడారు. పెద్దవడుగూరు గ్రామంలో ధనిక రైతు కుటుంబంలో జన్మించిన వీరారెడ్డి విద్యార్థి దశలోనే అభ్యుదయ భావాల వైపు ఆకర్షితుడై కమ్యూనిస్టు నేతగా మారారని గుర్తు చేశారు. ఆయన లా చదువు పూర్తి చేసినప్పటికీ వృత్తికి పరిమితం కాకుండా ప్రజా ఉద్యమాల్లో ఉండేందుకు నిర్ణయించుకుని రైతుసంఘం ద్వారా అనేక పోరాటాలు చేశారన్నారు. అంతేగాకుండా గుత్తి సమితికి జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారన్నారు. ప్రజాప్రతినిధిగా తన పదవీకాలంలో తాలూకాలో విస్తృతంగా పర్యటించి గ్రామాలకు మంచినీరు, పాఠశాలు, విద్యుత్, రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పనకు అనేక పోరాటాలు చేశారన్నారు. తర్వాత ఆది లక్ష్మమ్మను కులాంతర వివాహం చేసుకుని డాక్టర్ చదువు పూర్తి చేయించి గుత్తిలోనే ప్రాక్టీస్ పెట్టించి ప్రజలకు వైద్య సహాయం అందించేటట్లు ప్రోత్సహించారని కొనియాడారు. తన 67వ సంవత్సరంలో జిల్లాలో పట్టు రైతుల ఉద్యమంలో భాగంగా హిందూపురం ప్రాంతానికి వెళ్లి అక్కడ జరిగిన పోలీసు లాఠీ చార్జీలో తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఆయన్ను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగుదామని పిలుపునిచ్చారు.



గుత్తిలో జెడ్.వీరారెడ్డికి నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

గుత్తి : రైతుసంఘం నాయకులు (సిపిఎం), మాజీ సమితి అధ్యక్షులు, న్యాయవాది జెడ్.వీరారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని జెడ్.వీరారెడ్డి కాలనీలో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకురాలు వి.నిర్మల, మండల కార్యదర్శి బి.రామకృష్ణలు మాట్లాడుతూ జెడ్ వీరారెడ్డి ప్రజల పక్షపాతి అన్నారు. సమితి అధ్యక్షులుగా ఉన్న సమయంలో గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల దాహార్తి తీర్చడానికి ఎంతో కృషి చేశారన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వాలపై అనేక పోరాటాలు చేశారన్నారు. ఆదర్శంగా ఆదర్శంగా తీసుకుని ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలను కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మల్లేష్, కవిత, మురళి, వెంకటలక్ష్మి, నాగమ్మ, మల్లిక, తదితరులు పాల్గొన్నారు.


పెద్దవడుగూరులో జెడ్.వీరారెడ్డి ఘాట్ వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు

గుంతకల్లు : పేదలు, రైతుల పక్షపాతి కామ్రేడ్ జెడ్.వీరారెడ్డి ఆశయాలను కొనసాగిద్దామని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. జెడ్.వీరారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం పట్టణంలోని హంపిరెడ్డి భవనంలో చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ్ వీరారెడ్డి రైతుసంఘం, సిపిఎంలో పని చేసి ప్రజల కోసం ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేశారన్నారు. అలాంటి ఆయన పేరుతో ఉన్న జడ్ వీరారెడ్డి వీరారెడ్డి కాలనీలో వర్ధంతిని జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఆయన స్ఫూర్తితో పోరాటాలు, ఉద్యమాలను ముందుకు తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, కసాపురం రమేష్, వెంకీ, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

తాడిపత్రి రూరల్ : రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం మండల పరిధిలోని చల్లవారిపల్లి గ్రామ సమీపంలో ఉన్న రైల్వే ట్రాక్‌పై చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని సిపిఐ కాలనీలో నివాసం ఉంటున్న కిరణ్‌కుమార్ (28) పట్టణంలోని ఓ టింబర్ డిపోలో కార్పెంటర్‌గా పని చేస్తున్నాడు. అయితే తనకున్న అలవాట్ల కారణంగా పనిచేస్తూ వచ్చిన డబ్బులు సరిపోక కొంత అప్పులు చేసుకున్నాడు. అవి తీర్చే మార్గం తెలియక మనస్థాపం చెంది బుధవారం చల్లవారిపల్లి వద్ద రైల్వేట్రాక్‌పై రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న జిఆర్‌పి ఎస్ఐ నాగప్ప ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్ఐ తెలిపారు.

ఆటో ఢీ..యువకుడు మృతి

రాయదుర్గం : పట్టణంలోని గంగమ్మ బావి వద్ద ఆటో ఢీకొని అజయ్ (38) మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బుధవారం సాయంత్రం అజయ్ రోడ్డుపై నడుచుకుని వెళ్తుండగా వేగంగా వచ్చిన ఆటో ఢీకొంది. దీంతో అజయ్ మృతిచెందాడు. మృతుడికి భార్య, కూతురు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


మృతిచెందిన కిరణ్‌కుమార్

మున్సిపల్ కార్యాలయం ఎదుట వామపక్షాల ధర్నా

ప్రజాశక్తి-గుంతకల్లు

మున్సిపల్ కార్యాలయం పక్కన ఉన్న స్థలాన్ని పార్కింగ్ స్థలంగా కౌన్సిల్ తీర్మానం చేయరాదని డిమాండ్ చేస్తూ సిపిఎం, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఛైర్‌పర్సన్ భవానీ అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం జరుగుతుండగా అజెండాలో ఆ అంశానికి వ్యతిరేకంగా వామపక్ష పార్టీల నాయకులు చేరుకుని నినాదాలు చేశారు. అయితే ఆందోళనకారులను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో అక్కడికి చేరుకున్న ఛైర్‌పర్సన్ భవాని, కమిషనర్ మల్లికార్జున ఈ విషయంపై తిరిగి చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు, కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, కసాపురం రమేష్, మారుతీప్రసాద్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకులు చిన్న, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవానీకి వినతిపత్రం సమర్పిస్తున్న వామపక్షాల నాయకులు

పరిటాల రవీంద్రకు నివాళి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

భూమి ఉన్నంత వరకూ దివంగత పరిటాల రవీంద్రను ప్రజలు మర్చిపోరని మాజీ మంత్రి పరిటాల సునీత, తనయుడు పరిటాల శ్రీరామ్ అన్నారు. పరిటాల రవి వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం రామగిరి మండలంలోని వెంకటాపురంలో ఉన్న ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావడంతో సునీత, శ్రీరామ్ తీవ్ర బావోద్వేగానికి గురయ్యారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ పరిటాల రవి చనిపోయి 19ఏళ్లు అయిందంటే నమ్మబుద్ధి కావడం లేదన్నారు. ఆయన చేసిన కార్యక్రమాలు ఇప్పటికీ ప్రజల గుండెల్లో నిలిచే ఉన్నాయనానరు. ఎంతో మంది పుడుతారు.. చనిపోతారు.. కానీ చరిత్ర కొంతమంది మాత్రమే నిలిచిపోతారన్నారు. అలాంటి వారిలో ఎన్టీఆర్, పరిటాల రవి ముందుంటారన్నారు. అలాంటి పరిటాల రవిపై కొంతమంది కారుకూతలు కూస్తూ ఉంటారన్నారు. ఇలాంటి పిచ్చి కూతలతో ఆయన ఛరిష్మాను ఇంచు కూడా కదల్చలేరన్నారు. ఆయన సేవలను కొనసాగిస్తామన్నారు. ఇకపోతే వైసిపి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. ముఖ్యంగా సిఎం జనగ్ బటన్ నొక్కుడు తప్ప చేసేదేమీ లేదన్నారు. సోమవారం ఉరవకొండలో వైఎస్ఆర్ పేరుతో బటన్ నొక్కినా ఇంత వరకూ అక్కచెల్లెమ్మల ఖాతాల్లో నగదు పడలేదన్నారు. పోలవరం కట్టలేని దద్దం ప్రభుత్వం జగన్ ది అన్నారు. అలాగే తమ ప్రభుత్వంలో చంద్రబాబు రూ.800 కోట్లతో హంద్రీనీవా నుంచి పేరూరుకు ప్రాజెక్టు తెచ్చారని గుర్తు చేశారు. అలాంటి డ్యామ్‌కు వర్షాలు కురిసి నీరు వస్తే తామే తెచ్చామని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గొప్పలు చెప్పుకుంటున్నాడని విమర్శించారు. రానున్నది టిడిపి ప్రభుత్వమ అని, తాము అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యేగా దండుకున్న భూములను వెనక్కి తీసుకుని పేదలకు పంచుతామన్నారు.


పరిటాల రవికి నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు

క్రీడలతో మానసికోల్లాసం : ఎంపీ రంగయ్య

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం

క్రీడలతో మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎంపీ తలారి రంగయ్య అన్నారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నియోజకర్గ స్థాయి పోటీలను ప్రారంభించారు. ముందుగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల ఎదుగుదలకు అన్నివిధాలా ఉపయోగపడతాయన్నారు. శారీరక ఉల్లాసంతోపాటు బృహత్వాన్ని కూడా ఇస్తాయన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జిల్లా రాష్ట్ర దేశ స్థాయిలో క్రీడల్లో పాల్గొని విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మండల పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీడీలు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.


క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీ రంగయ్య

రాయదుర్గం : క్రీడాకారులను ప్రోత్సహించేందుకే రాష్ట్ర ప్రభుత్వం అడుదాం ఆంధ్ర కార్యక్రమం తీసుకొచ్చిందని ఎపిఐఐసి ఛైర్మన్ మెట్టు గోవిందరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని హైస్కూల్ మైదానంలో నియోజకవర్గస్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడలను మున్సిప్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్పతో కలిసి ప్రారంభించారు. ఇందులో భాగంగా క్రీడాజ్యోతిని వెలిగించారు. తర్వాత క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం స్వయానా కబడ్డీ ఆడి క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, ప్రత్యేకాధికారి నాగరాజు, కమిషనర్ వి.దివాకర్‌రెడ్డి, ఎంపిడిఒ కొండయ్య, ఎంఇఒ వెంకటరమేష్, మునిసిపల్ వార్డు సభ్యులు మంజునాథ, శివకుమార్, లావణ్య, శ్రీలక్ష్మి, గోవిందరాజులు, పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, వైసిపి నాయకులు పొరాళు శివ, నిజాముద్దీన్, బషీర్, కృష్ణమూర్తి, మునిసిపల్ సిబ్బంది, పాఠశాల అధ్యాపకులు, పాఠశాల పీడీలు, క్రీడాకారులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వారంలోపు ధర్మవరం రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ధర్మవరంలో వారంలోపు రోడ్ల మరమ్మతులు చేయపోతే తామే రంగంలోకి దిగి స్వయంగా రోడ్ల మరమ్మతులు చేపడతామని ధర్మవరం మాజీ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ స్పష్టం చేశారు. బుధవారం అనంతపురంలోని రోడ్లు, భవనాల శాఖ ఎస్ఇ ఓబుల్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ధర్మవరంలో 1,50,000 మంది ప్రజలు నివసిస్తున్నారన్నారు. వీరంతరూ సరైన రోడ్లు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అభివృద్ధి అనే పదానికి పాతరేసి తన వ్యక్తిగత ఆర్థికంగా అభివృద్ధి చెందారని ఆరోపించారు. నాలుగేళ్ల కాలంలో ధర్మవరం ప్రజలను పీల్చి పిప్పి చేసి సుమారు రూ.4వేల కోట్లు అక్రమంగా సంపాదించాడని ధ్వజమెత్తారు. అంతేగాకుండా తాను చేస్తున్న కాంట్రాక్టు పనులకు ఎమ్మెల్యే తీవ్రస్థాయిలో అడ్డంకులు సృష్టించారన్నారు. పనులు జరగకుండా వాహనాలను సీజ్ చేయించి, తప్పుడు కేసులు పెట్టించాడన్నారు. తాను న్యాయపోరాటం చేసి పనులను తిరిగి ప్రారంభించానని గుర్తు చేశారు. ధర్మవరం చెరువులో 45 ఎకరాలను కబ్జా చేసి గుర్రాల కోట, అధునాతన భవంతులను నిర్మించి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చాడని దుయ్యబట్టారు. మరో 100 ఎకరాలు చెరువు స్థలాన్ని కొల్లగొట్టేందుకు సిద్ధపడ్డాడన్నారు. దీనిపై నేషనల్ గ్రీనరీ ట్రిబ్యునల్ (ఎన్‌జిటి)కి ఫిర్యాదు చేశామన్నారు. ఈ మేరకు ఎన్‌జిటి విచారణ జరుగుతోందన్నారు. త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో లక్ష ఓట్ల మెజారిటీతో గెలవబోతున్నానని ధీమా వ్యక్తం చేశారు.

సిఎం జగనన్నకు కృతజ్ఞతలు

తాడిపత్రి : రాష్ట్రంలోని అక్క చెల్లెమ్మలందరికీ అండగా నిలుస్తున్న సిఎం జగన్‌కు కృతజ్ఞతలు అని వైసిపి విద్యార్థి విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి గంగులకుంట కేశవరెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన రుణమాఫీ చేస్తానని డ్వాక్రా అక్కచెల్లెమ్మలను చంద్రబాబు మోసం చేస్తే.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ఆర్ ఆసరా పథకం కింద నాలుగు విడతల్లో రూ.25,571 కోట్లు విడుదల చేసిన ఘనత సిఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఇందులో భాగంగానే ఉరవకొండలో 4వ విడత వైఎస్ఆర్ ఆసరా నిధులు రూ.6,394.83 కోట్లు బటన్ నొక్కి అక్కచెల్లెమ్మల ఖాతాల్లో జమ చేశారన్నారు. ఇందుకు కృతజ్ఞతలు తెలిపారు.

'ఉపాధి' పనులు పూర్తి చేయాలి

నార్పల : ఈ ఆర్థిక సంవత్సరానికి ఉపాధి హామీ పథకం కింద నిర్దేశించిన పనులను పూర్తి చేయాలని ఎపిడి అనురాధ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎపిఒ ఎర్రమ్మ ఆధ్వర్యంలో మండల ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిడి మాట్లాడుతూ ఈ ఆర్థిక సంవత్సరానికి చేసిన పనులన్నీ ఎంతవరకూ అయి ఉంటే అంతవరకూ పూర్తి చేయాలని సూచించారు. ఇందులో భాగంగా పనుల క్లోజింగ్ చూపించడానికి సాంకేతిక సమస్య వస్తోందని, పనులు చేసిన చోట బోర్డు ఏర్పాటు చేసిన ఫొటోలు కావాల్సి వస్తున్న నేపథ్యంలో బోర్డులు ఏర్పాటు చేయడం ఇబ్బందికరంగా మారిందని ఎపిడి దృష్టికి తీసుకొచ్చారు. ప్రతిఒక్కరూ పంచాయతీల వారీగా రికార్డులు, రిజిస్టర్లను కచ్చితంగా మెయింటైన్ చేయాలన్నారు. ఈ సమావేశంలో ఉపాధి హామీ టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ

పుట్లూరు : మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శింగనమల మార్కెట్ యార్డు ఛైర్మన్ భూమిరెడ్డి సునీత మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగానే అమ్మఒడి, జగనన్న విద్యాదీవెన, వసతిదీవెన వంటి పథకాలను తీసుకొచ్చిందన్నారు. విద్యార్థులు ఆయా అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒప్రేమ్ కుమార్, హెచ్‌ఎం విజయలక్ష్మి, పాఠశాల పూర్వపు విద్యార్థుల సంఘం అధ్యక్షుడు భూమిరెడ్డి నాగార్జునరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

బడుగుల ఆపద్బాంధవుడు పరిటాల రవి

పామిడి : బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, ఆపద్బాంధవుడు పరిటాల రవి అని గుంతకల్లు టిడిపి సీనియర్ నాయకులు, పిజెఆర్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు పెరుమాళ జీవానందరెడ్డి కొనియాడారు. పరిటాల రవి వర్ధంతిని పురస్కరించుకుని బుధవారం సత్యసాయి జిల్లా రామగిరి మండలం వెంకటాపురంలో ఉన్న ఘాట్ వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీమంత్రి పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌ను మర్యాద గాపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాహసమే ఊపిరిగా.. పోరాటమే ప్రాణంగా.. తిరుగుబాటే సిద్ధాంతంగా.. మరణం ఎదురొచ్చినా వెన్ను చూపని వీరుడుగా తెలుగు రాష్ట్రాల ప్రజల గుండెల్లో అస్తమించని రవిగా పరిటాల రవీంద్ర ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, పిజెఆర్ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

ఓటు అడిగే అర్హత వైసిపికే ఉంది..: ఎమ్మెల్యే అనంత

ప్రజాశక్తి-అనంతపురం

నాలుగున్నరేళ్లుగా ప్రజలతోనే ఉన్న వైసిపి నాయకులకు మాత్రమే ఓటు అడిగే అర్హత ఉందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం నగరంలోని అంబేద్కర్ భవన్ వెనుక ఉన్న ఓ గార్డెన్స్‌లో వైసిపి నగర అధ్యక్షులు చింతా సోమశేఖరరెడ్డి అధ్యక్షతన 'ఇంటింటికీ వైసీపీ' కార్యక్రమంపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనంత పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. మన గౌరవాన్ని నిలబెట్టిన సీఎం జగన్‌ను మరోసారి సిఎంను చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. చంద్రబాబు హయాంలో సంక్షేమ పథకాలు అందాలంటే ఆ పార్టీ నాయకుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి ఉండేదన్నారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ఈనేపథ్యంలో ఈనెల 27వ తేదీ నుంచి 'ఇంటింటికీ వైసీపీ' పేరుతో నియోజకవర్గంలోని ప్రతి గడపకూ వెళ్లి మరోసారి వైసీపీని ఆదరించాలని కోరుదామని పిలుపునిచ్చారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ చేయిచేయి కలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మీసాల రంగన్న, మంజుల, అశ్వర్థనాయక్, వెన్నపూస రవీంద్రారెడ్డి, రమేష్‌గౌడ్, ఫయాజ్, ఓబిరెడ్డి, ఆలమూరు శ్రీనివాసరెడ్డి, రమణ, కాగజ్‌ఘర్ రిజ్వాన్, శేఖర్‌బాబు, మన్సూర్, సైఫుల్లాబేగ్, ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి, ఆశాబీ, శ్రీదేవి, కృష్ణవేణి, ఉదయ్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

సిఎం సభ విజయవంతంతో హర్షం

ఉరవకొండ : సిఎం జగన్ ఉరవకొండ పర్యటన విజయవంతం కావడం పట్ల మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, వైఎస్ఆర్ అభిమానుల సమిష్టి కృషితోనే సాధ్యమైందన్నారు. ముఖ్యంగా సిఎం హోదాలో సిఎం జగన్ ఉరవకొండకు వచ్చి రాష్ట్రంలో మహిళలందరికీ వైఎస్ఆర్ ఆసరా నిధులు విడుదల చేయడం సంతోషంగా ఉందన్నారు. తమ అంచనాలకు మించి జనం వచ్చారన్నారు. సీఎం జగన్‌పై ప్రజలకు ఉన్న అభిమానానికి, విశ్వాసానికి ఈ సభకు వచ్చిన జనమే సాక్ష్యమన్నారు.

టిడిపి శ్రేణుల్లో వణుకు...

ఉరవకొండలో సిఎం సభ విజయవంతం కావడంతో టిడిపి శ్రేణుల్లో వణుకు పుట్టిందని వైసిపి నాయకులు అన్నారు. బుధవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ వైసిపి అధ్యక్షులు ఎసి ఎర్రిస్వామి, పట్టణ, రూరల్ కమిటీల సమన్వయకర్త ఓబన్న మాట్లాడుతూ సిఎం జగన్ సభ విజయవంతం కావడంతో తట్టుకోలేని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మతిభ్రమించి మాట్లాడుతున్నారన్నారు. ఆయన హయాంలో జరిగిన అవినీతి, వైసిపి హయాంలో జరిగిన అవినీతిపై తాము బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు. కేశవ్ కేవలం ఓటమి భయంతోనే పచ్చి అబద్ధాలు, పొంతన లేని మాటలు చెబుతున్నాడని విమర్శించారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ సుశీలమ్మ, పెన్నహోబిలం ఆలయ మాజీ ఛైర్మన్ అశోక్‌కుమార్, కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ కౌడికి గోవిందు, ఉప సర్పంచి వన్నప్ప, నాయకులు జయరాం, చిన్న భీమా, తలారి సీనా, గాదిలింగ, రామంజినేయులు, మాల రాము పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

టిడిపితోనే బిసిల అభివృద్ధి

'జయహో బీసీ'లో మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

ప్రజాశక్తి-పామిడి

తెలుగుదేశం పార్టీతోనే బిసిల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని రహమ్మత్ ఫంక్షన్ హాలులో జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక బీసీలకు రక్షణ కరువైందన్నారు. ఇలాంటి సమయంలో బీసీలకు మనోధైర్యం ఇచ్చేందుకే జయహో బీసీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభకు వందలాది మంది తరలిరావడం సంతోషంగా ఉందన్నారు. స్థానిక సంస్థల్లో బిసిలకు రిజర్వేషన్ కల్పించిన ఘనత టీడీపీదే అన్నారు. అంతేగాకుండా బీసీలను ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా తయారుచేసిన గొప్ప పరిశ్రమ టిడిపి అన్నారు. బిసిలకు తీవ్ర అన్యాయం చేస్తున్న వైసిపికి తగిన గుణపాఠం చెప్పి రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాల్సిన బాధ్యత బిసిలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు ఆవుల కృష్ణయ్య, గంజి నాగరాజు, వన్నూరు, ప్రతాప్‌నాయుడు, శేషు, నాగేంద్ర, నారాయణస్వామి, లక్ష్మీనరసింహా, రమేష్, చంద్రశేఖర్, గౌస్‌పీరా, సంజీవకుమార్, జింకల రామకృష్ణ, వడ్డే శివకుమార్, హరి, ఉప్పర రామాంజనేయులు, ధనుంజయ, అప్పన్నగారి కుమార్, సుంకప్ప, గాదిలింగ, శివశంకర్, వెంకటరమణ, ధనుంజయ, నారాయణస్వామి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జితేంద్రగౌడ్

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-కుందుర్పి

రైతులను ఆదుకోవడంలో సిఎం జగన్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి నాయకులు ఉన్నం మారుతీచౌదరి విమర్శించారు. బుధవారం మండల పరిధిలోనే అపిలేపల్లి గ్రామంలో 'బాబు ష్యూరిటీ–భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలో ఉన్నప్పుడు రైతులకు సబ్సిడీతో డ్రిప్పు, స్ప్రింక్లర్లు అందించి రైతులకు అండగా ఉండేవారమన్నారు. అయితే వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అలాంటి పథకాలన్నింటినీ ఎత్తివేశారన్నారు. ఇలాంటి అసమర్థ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మారుతీచౌదరి భార్య వరలక్ష్మి, మాజీ మండల కన్వీనర్ కర్తనపర్తి రామాంజనేయులు, మాజీ జడ్పిటిసి మల్లికార్జున, ఓబులేసు, చిరంజీవి, జిల్లా తెలుగు యువత కార్యదర్శి రామమూర్తినాయుడు, మాజీ సర్పంచి చిత్రలింగ, మాజీ కో–ఆప్షన్ తాయిర్, మాజీ ఎంపిటిసి అల్లాపురం ఈరన్న, యువరాజు, వీరాంజి, రామకృష్ణ, కుందుర్పి మాజీ ఉప సర్పంచి నారాయణస్వామి, రాజప్ప, రామయ్య, కె.రామాంజినేయులు, శ్రీనివాసులు, నాగేంద్ర, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై అవగాహన కల్పించాలి

నార్పల : బాల్యవివాహాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ మధుమాలిని పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని గూగూడులోని ఉన్నత పాఠవాలలో ఏర్పాటు చేసిన జాతీయ బాలికా దినోత్సవంలో ఆమె మాట్లాడుతూ బాలికలకు చిన్నవస్సులోనే పెళ్లిళ్లు చేయడం వల్ల అనేక సమస్యలు వస్తాయన్నారు. ముఖ్యంగా గర్భస్త శిశువు, మహిళ మనుగడకు ఎన్నో అనర్థాలు ఎదురై కుటుంబాలు చిన్నాభిన్నమైపోతాయని కావున తల్లిదండ్రులు ఆలోచించి వివాహాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ సిడిపిఒ భారతి, అంగన్వాడీలు సుధామని, వరలక్ష్మి, పార్వతి, ఆదెమ్మ, విద్యార్థులుచ తదితరులు పాల్గొన్నారు.

'శ్రీచైతన్య'లో క్యాట్ విజయోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

క్యాట్‌లో విద్యార్థులు ప్రతిభ కనబరచడంతో అనంతపురం జోన్ పరిధిలోని శ్రీచైతన్య విద్యాసంస్థల్లో విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ క్యాట్ పరీక్షల్లో అనేకమంది శ్రీచైతన్య విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారన్నారు. ఇందులో భాగంగా ఆయా విద్యార్థులు నగదుతోపాటు మెడల్స్, మెరిట్ సర్టిఫికెట్లను పొందరన్నారు. ఈ విజయానికి కారణమైన ఉపాధ్యాయ బృందాన్ని ఎజిఎం ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపళ్ల, వైస్ ప్రిన్సిపళ్లు, డీన్లు, సి బ్యాచ్ ఇన్‌ఛార్జిలు, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న శ్రీచైతన్య ఎజిఎం సుబ్బారెడ్డి

ఘనంగా అంకాలమ్మ జాతర

పామిడి : పట్టణ పరిధిలోని కొండూరు రోడ్డు సమీపంలో వెలసిన అంకాలమ్మ కుంటెమ్మ అమ్మవార్ల జాతర బుధవారం వైభవంగా జరిగింది. ఈ ఉత్సవానికి హాజరైన ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన రాతిదూలం లాగుడు పోటీల్లో ప్రథమ బహుమతి రూ.50 వేలు ప్రకటించి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల జడ్పిటిసి లావనూరు శోభ మధుసూదన్‌రెడ్డి, ఎంపిపి బోగాతి మురళీమోహన్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ జోజోడే కుమార్, నారాయణరెడ్డి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ చెన్నకేశవరెడ్డి, ఆలయ కమిటీ ఛైర్‌పర్సన్ మురళీగుప్తా, సునీల్‌రెడ్డి, బీసీ రాష్ట్ర డైరెక్టర్ దత్తు, సర్పంచుల ఫోరం అధ్యక్షులు నాగేశ్వర్‌రెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, నరసింహా పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరుకు వినతి

ఉరవకొండ : మండల పరిధిలోని రేణుమాకులపల్లి గ్రామంలో వెలసిన ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని గ్రామ సర్పంచి బోయ రామాంజనేయులు కోరారు. ఈమేరకు సిఎం జగన్ ఉరవకొండ పర్యటన సందర్భంగా కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి ప్రభుత్వం తరపున రూ.60 లక్షలు మంజూరు చేశారన్నారు. అయితే ఆలయ కమిటీ తరపున రూ.12 లక్షల కాంట్రిబ్యూషన్ చెల్లించాలని నిబంధన ఉండడంతో తమ గ్రామం చాలా చిన్న గ్రామమని భావించి రూ.6 లక్షలు మాత్రమే ఆలయ కమిటీ తరపున చెల్లిస్తామన్నారని వివరించారు. కావున మీరైనా స్పందించి ఆలయ నిర్మాణానికి సహకారం అందించాలని కోరారు.

చింతపండు విక్రయాలు ప్రారంభం

రాయదుర్గం రూరల్ : స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం నుంచి చింతపండు విక్రయాలు ప్రారంభమైనట్లు మార్కెట్ కార్యదర్శి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. కరిపులళి రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.17,600 కాగా, కనిష్ట ధర రూ.14,000 వరకూ పలికినట్లు తెలిపారు. ఫ్లవర్ రకం కనిష్ట ధర రూ.6000 కాగా, గరిష్ట ధర రూ.9,000 వరకూ పలికిందన్నారు. మార్కెట్‌కు 10.93 క్వింటాళ్ల చింతపండు వచ్చినట్లు తెలిపారు.

టిడిపితోనే అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

పెద్దవడుగూరు : అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందాలంటే తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకరరెడ్డి అన్నారు. యువచైతన్య రథం బస్సుయాత్రలో భాగంగా బుధవారం మండలంలోని కొండుపల్లి, కడదరగుట్టపల్లి, క్రిష్టిపాడు గ్రామాల్లో బస్సుయాత్ర చేపట్టారు. ఆయా గ్రామాల్లో జెసికి ఘన స్వాగతం పలికారు ఇందులో భాగంగా ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధినేత నారా చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. సంక్షేమంతోపాటు అభివృద్ధిని సమానంగా చేసే సత్తా చంద్రబాబుకే ఉందన్నారు. కావున రానున్న ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి తెచ్చుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, అవులంపల్లి కేశవరెడ్డి, గంగరాజు, దివాకరెడ్డి, దాదావలి, గోపాల్, హజీబాబా, హజీవలి, దామోదర్, ప్రకాష్‌నాయుడు, కృష్ణమూర్తి, ఈశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పంటల విక్రయానికి పేర్లు నమోదు : ఎడిఎ

గుత్తి : పత్తి, జొన్న, కంది, తదితర పంటలను విక్రయించుకునేందుకు రైతులు తమ పరిధిలోని రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.వెంకటరాముడు సూచించారు. బుధవారం పట్టణంలోని ఎడిఎ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని గుత్తి, పామిడి, పెద్దవడుగూరు, యాడికి, సింగనమల మండలానికి చెందిన వ్యవసాయ అధికారులు, ఎఇఒలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంది పంటకు రూ.9,370 (క్వింటాల్లో) జొన్నకు రూ.3,225, హైబ్రిడ్ జొన్న రూ.3,180 ధరలతో పౌర సరఫరాల శాఖ కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. పత్తి క్వింటా రూ.7,020 ధరతో సిసిఐ కొనుగోలు చేస్తుందని వివరించారు. అయితే వంట నమోదు కోసం రైతులందరూ ఇకెవైసి చేయించుకోవాలన్నారు.